# బైబిలుకు వెలుపట ఆయన మానవత్వం రుజువు చేయబడిన తీరు

యేసు దేవత్వాన్ని గూర్చి మనం విస్తరించి మాట్లాడాం. దేవత్వాన్ని గూర్చి మనం మాట్లాడినప్పుడు, మనం దేవుని గూర్చి, సర్వోన్నతుడైన వ్యక్తిని గూర్చి మాట్లాడాం. వ్యక్తిత్వంలో దేవుని మనం గుర్తింపగోరినప్పుడు, తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు లేక ఆత్మయైన దేవుడు అనే వారిని గూర్చి మనం మాట్లాడతాం. యేసు కుమారుడైన దేవుడైయున్నట్టు మనం చూచాం. యేసు నరావతారియైన దేవుడు, శరీరమందున్న దేవుడు. (కల్తీలేని ఆత్మయైన) దేవుడు పవిత్రం కాని పదార్థం (శరీరం)తో అంత అన్యోన్యంగా కలిసిపోదు అని నమ్మిన డొసెటిక్స్ యేసు యొక్క మానవత్వాన్ని నిరాకరిస్తారు. అది అసత్య బోధ; అది నేటికిని ఉంది. ఈ రచ్చ అంతా ఎందుకు? దేవుడు రక్షకుడు కాదా? యేసు మానవుడై యుండినట్టు గ్రహించడం ఎందుకు ముఖ్యం?

మానవాళిని రక్షించడానికి దేవుడు నరరూపు దాల్చాడనే ఆశ్చర్యమైన గ్రహింపును యేసు యొక్క మానవత్వం మనకు యిస్తుంది. ఆరంభ కాలములనుండియు రక్తంలో ప్రాణముందని మనిషి బోధింపబడుతునే ఉన్నాడు. పాపక్షమాపణకు రక్త ప్రోక్షణం అవసరమే గాని, జంతువుల రక్తం పాపాన్ని తొలిగించలేక యుండింది (లేవీయ. 17:11; హెబ్రీ. 10:4). అందునుబట్టి, మన పాప స్థితిలోనుండి మనలను రక్షించడానికిగాను, దానినుండి మనలను మనమే రక్షించుకునే స్థితిలో లేము గనుక, కుమారుడైన దేవుడు, పరిపూర్ణమైన, పాపరహితమైన, అపరిమితమైన శక్తిగల రక్త బలిని అర్పించాడు (హెబ్రీ. 9:11-14). దీన్ని గుర్తుంచుకో! సిలువపై కార్చబడిన రక్తము ఏదో యొక రకమైన "దైవిక" రక్తం కాదు. ఆ శరీరము మానవాతీత శరీరం కాదు. సిలువపై యేసు యొక్క మరణం దేవుని మరణం కాదు. అది మానవుని, ఒక నరుని మరణం. అది అవసరమైయున్న బలి. (దీని కంటె తక్కువైన బలి సరిపోయి ఉంటే, తండ్రి తన కుమారుని యింతటి బలికి లోబరచి యుండేవాడేనా?) గనుక, యేసు యొక్క మానవత్వాన్ని కాదనడం, ఒక విధంగా, మన సొంత రక్షణను వద్దు అనడమే ఔతుంది. యేసు యొక్క దేవత్వాన్ని, ఆయన మానవత్వం యొక్క ప్రాముఖ్యతను మనం నొక్కి పలికిన తదుపరి, ఆయన చారిత్రకత మరియు ఆయన మానవత్వాన్ని స్థిరపరచే రికార్డులవైపుకు మన దృష్టిని మళ్లించుదాం.

కుమారుడైన దేవుని గూర్చి బైబిలు ఏమి చెప్పుతుందో ప్రాథమికంగా దానియందు మనం అక్కర కలిగియున్నాం. అయినా, దశాబ్దాల తరబడి నేను సువార్త ప్రకటిస్తూ, ఉపదేశిస్తుండగా, యేసు యొక్క ఉనికిని గూర్చిన రుజువులు బైబిలు వెలుపట ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నలు తరచుగా అడుగుతుంటారు. లోకంలో యేసు యొక్క ఉనికికి నిదర్శనంగా క్యాలండర్ సంవత్సరం అనే ఉదాహరణతో మనమందరం ప్రభావితం అవుతాం!

ప్రశ్నించిన వారు సాహిత్యపు సాక్ష్యాధారాలు కోరారు. "బైబిలుకు వెలుపల" క్రీస్తు జీవితానికి సంబంధించి సాక్ష్యాధారాలు ఉన్నాయా అని అనుకునేవారికి, కాల ప్రభావానికి లోబడక సజీవంగా నిలిచియున్న లిఖిత పూర్వకమైన మూలాలను కొన్నింటిని క్లుప్తంగా ప్రస్తావించుకుందాం. దయచేసి గమనించండి: ఈ ఋజు పత్రాలను మనం వ్యాఖ్యానించడం లేదు సరిగదా, వాటికి విలువ కూడా కట్టడంలేదు. బైబిలుకు వెలుపట యేసు ప్రస్తావించ బడ్డాడన్న రుజువుకొరకు మాత్రమే వాటిని ప్రస్తావిస్తున్నాం.

యేసు యూదుడుగా ఉండి, ప్రత్యేకంగా యూదుల మధ్య నివసించి, పనిచేసి యున్నందున, ఏ యూదుల మూలము కూడా యేసు వారి మధ్య నివసించలేదని చెప్పడం లేదు. దానికి భిన్నంగా, బైబిలుకు వేరైన మూలం ఆయన ఉన్నాడన్న విషయాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు, క్రీ.శ. మొదటి శతాబ్దపు చరిత్రకారుడైన జోసీఫస్ అతని *Antiquities of the Jews*, అనే దానిలో ఈ క్రింది విధంగా దాఖలు చేశాడు:

> మనం నిజంగా ఆయనను మానవుడని పిలువదలచుకుంటే, ఆ కాలములో యేసు అనే ఒక జ్ఞాని వెలిశాడు. ఆయన ఆశ్చర్యకరమైన కార్యాలను (అద్భుతాలను) చేసేవాడు, సత్యాన్ని ఆనందంతో అంగీకరించే జనులకు ఆయన బోధకుడు. ఆయన అనేకమంది యూదులను, అన్యజనులను కూడా తనవెంట కొనిపోయాడు. ఈ మనుష్యుడు క్రీస్తయి ఉన్నాడు.[1]

యేసు నిజంగా చారిత్రక పురుషుడైయున్నట్టు రోమా రచయితలు కూడా చూపారు. టాసిటస్ రోమా చరిత్రకారుడు. అతడు మొదటి శతాబ్దంలో జీవిస్తూ క్రీ.శ. 120వరకు ఉన్నాడు. క్రీ.శ. 64లో రోములో ఎక్కువ భాగాన్ని నాశనం చేసిన అగ్నిని గూర్చి అతడు వ్రాసే సందర్భంలో, రోమునందు జీవించుతున్న క్రైస్తవులపై నీరో ఆ విపత్తు యొక్క దోషాన్ని మోపాడు:

> తత్ ఫలితంగా (రోముకు నిప్పు అంటించినట్టు తనపై వచ్చిన), రిపోర్టును తొలగించు కొనడానికిగాను, తమ చెడు కార్యముల నిమిత్తము ద్వేషింపబడి, జనులచే క్రైస్తవులని పిలువబడే ఒక తెగమీద ఆ దోషాన్ని ఆరోపించి, నీరో వారిని బహు ఘోరమైన హింసలకు గురిచేశాడు. పొంతి పిలాతు అను మన ప్రొక్యూరేర్స్‌లో ఒకని చేతులమీద, తిబెరయ యొక్క ఏలుబడి కాలంలో ఘోరమైన శిక్షను అనుభవించిన క్రీస్తు అనేవానినుండి ఆ పేరు ఆరంభమయ్యింది ...[2]

యూదా, రోమా మూలాల్లోనుండి యింకను యితర రుజువులు చెప్పవచ్చుగాని,

యివ్వబడినవే మన ఉద్దేశాన్ని నెరవేర్చడానికి చాలినవైయున్నాయి. యేసు అనే ఒక మనుష్యుడు నిర్దిష్టమైన స్థలంలో చరిత్రయొక్క నిర్దిష్టమైన కాల పరిధిలో జీవించాడు. ఇది బైబిలు, బైబిలేతర మూలాలనుండి రుజువు చేయబడింది. బైబిలు వెలుపల వ్రాసినవారు ఆది క్రైస్తవ ఉద్యమానికి సాధారణంగా వ్యతిరేకులే. కొన్ని మూలాలను విమర్శకులు వ్యతిరేకించినా, బైబిలేతర మూలాల్లో చరిత్ర పురుషుడైన యేసు వాస్తవమైయున్నట్టు నిలిచియున్నాడు. యేసు నిజంగానే జీవించి ఉండక పోయినట్టయితే, జోసీఫసు, టాసిటస్‌వంటి చరిత్రకారులు – పిలాతు, తిబెరయవంటి యితర చరిత్ర పురుషులతో జతచేసి, వారు యేసునుగూర్చి ఎందుకు వ్రాయాలి?

యేసు "నిజమైన దేవుడు మరియు నిజమైన నరుడు" అని ప్రాచీన మత విశ్వాసాలు తెలుపుతాయి. ఇది క్రైస్తవ విశ్వాసము యొక్క ప్రాథమిక ఆధారమును సారాంశమునై ఉంది. క్రైస్తవ్యానికి ఆధారంగా నిలిచిన ఈ సత్యము, పాత నిబంధన సమాచారాన్ని ఉపయోగించుకొని, మొదటి శతాబ్దపు చివరి సగ భాగమంతటిలో ప్రత్యక్షమౌతున్న లేఖనాలను పఠించడం ద్వారా లభించిన ఆరంభ సువార్త ప్రకటననుండి వచ్చింది.

---

సూచనలు

[1]Josephus *Antiquities* xviii.3.3.; quoted in Everett F. Harrison, *A Short Life of Christ* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1968), 17. [2] Tacitus *Annals* xv. 44; quoted in Moses Hadas, ed., *The Complete Works of Tacitus*, Modern Library, trans. A. J. Church and W. J. Brodribb (New York: Random House, 1942), 380-81. See also C. Milo Connick, *Jesus: the Man, the Mission, and the Message*, 2d ed. (Englewood Cliffs, N.J.: Prentice-Hall, 1974), 59.